# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




బండి భగీరథ్‌కు షాక్..
దేశం వీడకుండా లుకౌట్ నోటీసులు


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 283 పేజీలు : 04 వెల రూ. 2 ఆదివారం 17 - 05 - 2026


# 25 ఏళ్ల తర్వాత తెలంగాణలో 'ఎస్ఐఆర్'

- జూన్ 15 నుంచి ప్రక్రియ షురూ
- జూన్ 25 నుంచి జులై 24 వరకు వెరిఫికేషన్ ప్రక్రియ
- ప్రతి ఓటర్‌కు రెండు ఫామ్‌లు
- జులై 31న డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ విడుదల
- జులై 31-ఆగస్టు 30 మధ్య అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా



**హైదరాబాద్ :**
తెలంగాణలో వచ్చే నెల 15 నుంచి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన మీడియాతో పంచుకున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు అధికారులు, బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇస్తారని సుదర్శన్ రెడ్డి వివరించారు. ప్రతి ఓటర్‌కు రెండు ఫామ్‌లు అందుతాయన్నారు. అందులో ఒకటి నింపి తిరిగి బీఎల్‌వోలకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. రెండో ఫామ్‌ను ఓటరు తమ వద్దే అక్నాలెడ్జ్‌మెంట్ కింద - మిగతా 2 లో

# బండి భగీరథ్ కేసులో మేడ్చల్ కోర్టుకు హాజరైన బాధితురాలు



- మేజిస్ట్రేట్ ఎదుట స్టేట్‌మెంట్ ఇచ్చిన బాధితురాలు
- ఇప్పటికే రెండుసార్లు వాంగ్మూలం ఇచ్చిన బాధితురాలు
- తాజాగా బాధితురాలితో పాటు తల్లి స్టేట్‌మెంట్ రికార్డు

**హైదరాబాద్ :**
బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో బాధితురాలు తన తల్లితో కలిసి మేడ్చల్ కోర్టుకు హాజరై, మేజిస్ట్రేట్ ఎదుట స్టేట్‌మెంట్ ఇచ్చింది. బాధితురాలు ఇప్పటికే రెండుసార్లు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చింది. తాజాగా, బాధితురాలితో పాటు తల్లి స్టేట్‌మెంట్‌ను కూడా పోలీసులు రికార్డు చేశారు. తన కుమార్తెకు బలవంతంగా మద్యం ఇచ్చి, బలహీనస్థితిలో ఉన్న సమయంలో బండి భగీరథ్ ఒత్తిడి చేసి అనుచితంగా - మిగతా 2 లో

# మొత్తం మహిళా లోకాన్నే అవమానిస్తున్నారు




- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత
- అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న కవిత
- సమరయోధుల పెన్షన్లు అందించే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్
- ఉద్యమకారులను గుర్తించే కమిటీలో మహిళకు స్థానం లేకపోవడంపై విమర్శ

# విదేశాల్లో ఉన్నా సొంత దేశంలో ఉత్సవానికి హాజరైనట్టుగా ఉంది

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- విదేశాల్లో ఉన్న విషయాన్ని మర్చిపోయా.. సొంత దేశంలో ఉత్సవానికి హాజరైనట్టుగా ఉంది
- నెదర్లాండ్స్ లోని ది హేగ్ లో ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మోదీ
- ఆర్థిక, సాంకేతిక రంగాలలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య
- సెమీకండక్టర్ల తయారీ రంగంలో వేగంగా ముందడుగు వేస్తున్నామన్న ప్రధాని



**ఢిల్లీ :**
భారతదేశం ప్రస్తుతం ఆర్థిక, సాంకేతిక రంగాలలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని మోదీ అన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా 'ది హేగ్' నగరంలో ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం సాధిస్తున్న డిజిటల్ ప్రగతిని, ప్రవాస భారతీయుల సేవలను ఆయన కొనియాడారు. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపుల రంగంలో భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని ప్రధాని గర్వంగా ప్రకటించారు. దేశంలో ఇప్పుడు నెలకు ఏకంగా 20 బిలియన్ డాలర్ల మేర డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని వెల్లడించారు. సాంకేతిక రంగంలో మన దేశం ఎంతో ప్రగతి సాధించిందని చెప్పారు. ఒకప్పుడు భారత్‌లో కేవలం 4 యూనికార్న్ స్టార్టప్ సంస్థలు మాత్రమే ఉండేవని, కానీ నేడు వాటి సంఖ్య 100కు చేరిందని గుర్తుచేశారు. భవిష్యత్తు సాంకేతికతకు అత్యంత కీలకమైన సెమీకండక్టర్ల తయారీ రంగంలోనూ భారత్ వేగంగా ముందడుగు వేస్తోందని, దానికి సంబంధించిన పనులు క్షేత్రస్థాయిలో చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్‌లో ఉన్న భారతీయుల ప్రేమ, ఉత్సాహాన్ని చూస్తుంటే తాను విదేశంలో ఉన్నాననే సంగతి మర్చిపోయానని, సొంత దేశంలో ఏదో ఉత్సవానికి హాజరైనట్లు అనిపిస్తోందని ప్రధాని భావోద్వేగానికి లోనయ్యారు. నెదర్లాండ్స్ నాయకత్వం ఎప్పుడు కలిసినా అక్కడి భారతీయ సమాజం చూపిస్తున్న ప్రతిభను, క్రమశిక్షణను ప్రశంసిస్తూనే ఉంటుందని చెప్పారు. తరాలు మారి, దేశాలు మారినా - మిగతా 2 లో

# పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.10 పెరిగే అవకాశం!




- శుక్రవారం లీటర్‌పై రూ.3 పెంపు
- సమీప భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం
- దశలవారీగా రూ.10 పెంచే అవకాశం

# భోజ్‌శాల తీర్పు బాబ్రీ మసీదు తీర్పులాంటిదే

- ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ
- భోజ్‌శాల తీర్పు బాబ్రీ మసీదు తీర్పును పోలి ఉందన్న ఒవైసీ
- ఇది కూడా నమ్మకం ఆధారంగానే ఇచ్చిన తీర్పు అని విమర్శ
- ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందని ఆశాభావం





# నా వ్యాఖ్యలను వక్రీకరించారు

- భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్
- నకిలీ, బోగస్ డిగ్రీలతో వృత్తిలోకి ప్రవేశించే వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లు వెల్లడి
- కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన
- భారత యువత పట్ల తాను గర్వపడుతున్నానన్న జస్టిస్ సూర్యకాంత్



**ఢిల్లీ :**
కొంతమందిని తాను పరాన్నజీవులుగా లేదా బొద్దింకలుగా పోల్చిన వివాదంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందించారు. ఒక కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన వివరణ ఇచ్చారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో ఈ వృత్తిలోకి వచ్చేవారిని ఉద్దేశిస్తూ తాను ఆ వ్యాఖ్యలు చేశానని అన్నారు. ఇలాంటి వారే మీడియా, సోషల్ మీడియాతో పాటు ఇతర రంగాల్లోకి చొరబడ్డారని అన్నారు. అందుకే అలాంటి వారిని పరాన్నజీవులుగా పేర్కొన్నట్లు తెలిపారు. కానీ మీడియాలో కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ యువత పట్ల - మిగతా 2 లో

## ప్రజానాడి




# రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

- నా జీవితాశయం ఇదే.. ఈ నాలుగు కార్యక్రమాలే నా ప్రాధాన్యం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- పరిశుభ్రత, పేదరిక నిర్మూలన, జనాభా పెరుగుదల, భూ రికార్డుల ప్రక్షాళనే తన ప్రాధాన్యతలని స్పష్టం చేసిన సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు
- ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవద్దు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలన్నదే తన సంకల్పమని వెల్లడి
- గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ, విధ్వంసానికి, అభివృద్ధికి ఉన్న తేడాను గమనించాలని ప్రజలకు పిలుపు
- నరసన్నపేట నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనులను మంజూరు చేస్తూ వేదికపై నుంచే హామీ



**శ్రీకాకుళం :**
శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. తన మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలే రాష్ట్ర భవిష్యత్తుకు మూలస్తంభాలని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చే 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర', పేదలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలు, జనాభా సమతుల్యత, భూ రికార్డుల ప్రక్షాళన తన జీవితాశయమని ఆయన స్పష్టం - మిగతా 2 లో

# రాయల్ ఎన్ ఫీల్డ్ బండెక్కిన చంద్రబాబు




- శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన సీఎం చంద్రబాబు
- 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- పోలీసులు ఏర్పాటు చేసిన హెల్మెట్ బ్యాంక్‌కు ప్రశంసలు
- హెల్మెట్ ధరించి రాయల్ ఎన్ ఫీల్డ్ బైక్‌పై కూర్చున్న చంద్రబాబు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అందరినీ ఆశ్చర్యపరిచారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనలో భాగంగా ఆయన హెల్మెట్ ధరించి, రాయల్ ఎన్ ఫీల్డ్ క్లాసిక్ 650 బైక్‌పై ఎక్కారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. - మిగతా 2 లో

# సంపాదకీయం

## అస్పష్ట 'శిఖరాగ్రం'!

దశాబ్దకాలంగా ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక, ఇంధన రంగాల్లో పరస్పరం తలపడుతూ, వాటితోపాటే ఒకదానిపై మరొకటి అవిశ్వాసాన్ని దండిగా పెంచుకున్న రెండు అగ్ర రాజ్యాలు చర్చలకు సిద్ధపడ్డాయంటే ప్రపంచం చాలా ఆశిస్తుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బుధవారం బీజింగ్ చేరుకున్నప్పుడు ఆయనకు లభించిన స్వాగత సత్కారాలు గమనించినా, శిఖరాగ్ర సమావేశం జరిగిన గురు, శుక్రవారాల్లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై ఆయన కురిపించిన ప్రశంసలు చూసినా అంతా సవ్యంగా ముగిసిందని అనిపిస్తుంది. ట్రంప్‌తో వచ్చిన ప్రతినిధి బృందం సామాన్యమైనది కాదు. భిన్నరంగాల్లో ప్రపంచాన్నేలుతున్న దిగ్గజ సంస్థల చీఫ్‌లు 16 మంది ఆ బృందంలో ఉన్నారు. టెస్లా, స్పేస్ ఎక్స్‌ల సీఈఓ ఎలాన్ మస్క్, యాపిల్ చీఫ్ టిమ్ కుక్‌లతోపాటు ఎన్‌విడియా, క్వాల్‌కామ్, బ్లాక్‌రాక్, గోల్డ్‌మాన్ శాక్స్, బోయింగ్, మెటా సంస్థల సీఈఓలు వారిలో కొందరు. చైనాతో అద్భుతమైన ఒప్పందాలు కుదిరాయనీ, అవి ఇరు దేశాలకూ ఎంతో గొప్పవనీ ట్రంప్ ప్రకటించినా ఆ ఒప్పందాల వైనమేమిటో ఎవరికీ తెలియదు. బోయింగ్ సంస్థకు చెందిన 200 జెట్ విమానాలు వెంటనే, భవిష్యత్తులో మరో 750 కొనడానికి చైనా అంగీకరించిందనీ... అలాగే వందలకోట్ల డాలర్ల విలువైన సోయాబీన్స్ కొనుగోలు చేయడానికి కూడా ఒప్పుకున్నదనీ ట్రంప్ చివరిలో వివరించారు. కానీ అందుకు సంబంధించి ఎలాంటి ప్రకటనలూ రాలేదు. లిఖితపూర్వక ఒప్పందాలు కుదిరిన దాఖలా లేదు. ప్రాథమిక చర్చలవరకూ జరిగి ఉంటాయన్నది దౌత్యరంగ నిపుణుల అభిప్రాయం. ఇరు దేశాలమధ్యా సాగిన సుంకాల యుద్ధం సామాన్యమైనది కాదు. ట్రంప్ సుంకాలు ప్రకటించిన ప్పుడల్లా చైనా దీటుగా స్పందించి ప్రతీకార సుంకాలు విధిస్తూ పోయింది. అరుదైన ఖనిజాల ఎగుమతుల్ని చైనా నిలిపేయటంతో అమెరికా విలవిల్లా డింది. ఇక కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో ఆధిపత్యం కోసం రెండూ హోరాహోరీ పోటీ పడుతున్నాయి. ఎన్‌విడియా అత్యాధునిక చిప్‌లు కావాలని చైనా కోరుతుండగా భద్రతా కారణాల రీత్యా కుదరదన్నది అమెరికా వాదన. బహుశా చైనా ఆశలు ఈడేరకపోవటంవల్ల... కొన్ని అంశాల్లో పట్టు సడలించటానికి అమెరికా నిరాకరించటంవల్ల ఒప్పందాలపై ప్రాథమిక చర్చలే సాగాయని అనుకోవాలి. కనీసం వచ్చే సెప్టెంబర్‌లో షీ అమెరికా పర్యటన నాటికైనా స్పష్టత వస్తే మంచిదే. ప్రపంచం మునుపటి తీరుగా లేదని మాత్రం ట్రంప్‌కు అర్థమై ఉంటుంది. ఎందుకంటే తైవాన్ విషయంలో తమకంటూ ఒక 'రెడ్‌లైన్' ఉన్నదని షీ జిన్‌పింగ్ నిర్మొహ మాటంగా చెప్పారని మీడియా అంటున్నది. అయితే తైవాన్‌పై గత వైఖరే కొనసాగుతుందని ట్రంప్‌తో వచ్చిన అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో చెప్పటం మినహా మరేదీ బయటకు రాలేదు. తమ సొంతమని చైనా చెబుతున్న తైవాన్‌ను స్వతంత్ర, స్వయంపాలిత, ప్రజాస్వామిక దేశంగా మనుగడ సాగించనీయాలన్నది అమెరికా వాదన. 1979 నుంచి దానితో సంబంధాలు నెరపుతున్నా అవన్నీ 'అనధికారమైనవి'. కానీ తైవాన్‌కు ఆయుధ విక్రయం జరపాలని ఇటీవల అమెరికా అనుకోవటాన్ని చైనా తీవ్రంగా పరిగణిస్తోంది. అందుకే ఈ 'రెడ్‌లైన్' హెచ్చరిక. ఇక ఇరాన్ యుద్ధం, హోర్ముజ్ జలసంధివద్ద ఉద్రిక్తతలపైనా ఇరు దేశాలూ ఒకే అభిప్రాయంతో ఉన్నట్టు పైకి అంటున్నా వాటిపైనా స్పష్టత లేదు. ఈ పర్యటన తర్వాత హోర్ముజ్ వద్ద సామరస్యత ఏర్పడు తుందేమో చూడాలి. దౌత్య పరిభాషలో మర్యాదపూర్వకమైన పదాలు చాలా ఉంటాయి. అందులో రెండు దేశాలమధ్యా కుదిరిందని చెబుతున్న విజన్ కొత్తది. 'నిర్మాణాత్మక వ్యూహాత్మక స్థిరత్వం' అనే ఈ విజన్ అర్థం 'పూర్తిగా స్నేహితులం కాలేకపోయినా, శత్రువులుగా మారి యుద్ధా నికి దిగొద్దు' అన్నదే. సారాంశంలో పూర్వపు సోవియెట్ అధినేత కృశ్చేవ్ బోధించిన 'శాంతియుత పోటీ' వంటిది. నిజానికి ట్రంప్ పర్యటన ఆంతర్యం ఇదే. తమతో సరి సమాన స్థాయికి ఎదిగిన చైనాతో ఇరాన్, తైవాన్ ల విషయంలో స్పర్థ రాకూడదని ఆయన కోరుకుంటున్నారు. ఆ పరిమితుల్లో చూస్తే ట్రంప్ పర్యటన విజయవంతమైందను కోవాలి. కానీ ట్రంప్ ఏలుబడిలో అమెరికా ఏ మేరకు ఒదిగి ఉంటుంది... చైనా ఏ స్థాయి వరకూ తగ్గివున్నట్టు కనబడుతుందన్నది రానున్న కాలమే చెబుతుంది.

# రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

**మొదటిపేజీ తరువాయి -** చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించి, రాష్ట్రాన్ని చెత్త రహితంగా మార్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రజల అభిమానాన్ని చూస్తుంటే ఎంత కష్టపడినా తక్కువేననిపిస్తోందని చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "నా మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలు ఉన్నాయి. మొదటిది రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర. రెండోది నెల మొదటి తారీఖున పేదలకు పింఛన్లు అందించి వారి బాగోగులు తెలుసుకోవడం. మూడోది జనాభా నియంత్రణ పేరుతో గతంలో జరిగిన పొరపాటును సరిదిద్ది, పిల్లల్ని సంపదగా భావించడం. అందుకే మూడో బిడ్డకు రూ.30,000, నాలుగో బిడ్డకు రూ.40,000 అందిస్తున్నాం. నాలుగోది, గొడ్డలి పార్టీ నాశనం చేసిన భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీతో ప్రక్షాళన చేసి, 2027 మార్చి నాటికి భూతగాదాలు లేని రాష్ట్రంగా మార్చడం" అని తన లక్ష్యాలను వివరించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం 17వ సారి నిర్వహిస్తున్నామని, దీని ద్వారా రాష్ట్రంలో మార్పు కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. "స్వచ్ఛత అంటే రోడ్లు, ఇళ్లు శుభ్రంగా ఉండటమే కాదు, మన ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలి. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పేరుకుపోయిన 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్‌ను క్లియర్ చేయడానికి 23 నెలలు పట్టింది. జూన్ నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చేసే బాధ్యత మాది" అని హామీ ఇచ్చారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు, వ్యర్థాల సేకరణకు 'స్వచ్ఛ రథం', పాఠశాలల్లో 'నెట్ జీరో' విధానం వంటి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. "ఒకప్పుడు దేశంలో ఏ నగరానికి వెళ్లినా శ్రీకాకుళం కాలనీ ఉండేది. ఈ పరిస్థితి మారాలి. ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలి. ఇదే నా సంకల్పం" అని ఆయన స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, మూలపేట పోర్ట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఉత్తరాంధ్ర దశ, దిశ మారుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులైన మధ్యవలస స్టేజ్-2, హీరమండలం ఎత్తిపోతల, వంశధార, జంఝావతి ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని క్యాలెండర్ ప్రకటించారు. 60 ఏళ్ల కల అయిన నేరేడి బ్యారేజ్‌ను ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా నిలిచి అవార్డులు సాధించిన అధికారులను, ప్రజాప్రతినిధులను చంద్రబాబు వేదికపై నుంచి అభినందించారు. దేశంలోనే 8 అవార్డులు సాధించి పంచాయతీరాజ్ శాఖ నంబర్ వన్‌గా నిలిచిందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే రమణమూర్తి విజ్ఞప్తి మేరకు, నరసన్నపేటలోని రాజుల చెరువు ఆధునీకీకరణ, ఓల్డ్ ఎన్హెచ్ రోడ్డు విస్తరణ, శ్రీముఖలింగం ఆలయ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించడం వంటి పలు అభివృద్ధి పనులకు అక్కడికక్కడే ఆమోదం తెలిపారు. ఎర్రన్నాయుడు పార్క్ కేసును పరిష్కరించే బాధ్యతను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించారు. తన ప్రసంగంలో భాగంగా ముఖ్యమంత్రి, శ్రీకాకుళం జిల్లా అధికారుల పనితీరుపై డేటాతో సహా సమీక్ష నిర్వహించారు. "50 ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి రాష్ట్ర సగటు 72.96% ఉండగా, శ్రీకాకుళం జిల్లాలో 75.2% ఉండటం అభినందనీయం" అని కలెక్టర్‌ను, అధికార యంత్రాంగాన్ని ప్రశంసించారు. రీ-సర్వే, తాగునీరు, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ వంటి విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన వారిని అభినందిస్తూనే, ఆర్టీసీ బస్ సర్వీసులు, గంజాయి నియంత్రణ, సీఎం రిలీఫ్ ఫండ్ అమలులో వెనుకబడిన శాఖల అధికారులను హెచ్చరించారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "అధికారం అంటే విధ్వంసం కాదు, ప్రజల జీవితాలను మార్చే అవకాశం. గత ఐదేళ్లు ప్రభుత్వ టెర్రరిజం, కబ్జాలు, అరాచకాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడింది. బాబాయ్‌ని గొడ్డలితో చంపి, ఆ నింద నాపై వేసి ఎన్నికల్లో గెలిచారు. అలాంటి వారి కొత్త నాటకాలతో మళ్లీ వస్తారు, జాగ్రత్తగా ఉండాలి" అని ప్రజలను హెచ్చరించారు. విధ్వంసానికి, అభివృద్ధికి మధ్య ఉన్న తేడాను గమనించి, రాష్ట్ర భవిష్యత్తు కోసం అభివృద్ధికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

## కూటమి పాలనలో అవినీతి, డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమే కనిపిస్తున్నాయి



**మొదటిపేజీ తరువాయి -** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైందని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. పాలనలో కేవలం అవినీతి, డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమే కనిపిస్తున్నాయని విమర్శించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధి రేటు 10.75 శాతంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారని, ఒకవేళ అదే నిజమైతే ప్రభుత్వ ఆదాయ వృద్ధి రేటు ఎందుకు 3.22 శాతానికి పడిపోయిందని జగన్ ప్రశ్నించారు. రాష్ట్రం నిజంగానే అభివృద్ధి చెందితే, దానికి అనుగుణంగా ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ కూడా పెరగాలి కదా అని ఆయన నిలదీశారు. వైసీపీ పాలనలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో పన్నుల ద్వారా రాష్ట్రానికి రూ. 85,922.23 కోట్ల ఆదాయం వచ్చిందని జగన్ గుర్తుచేశారు. గడిచిన రెండేళ్లలో సాధారణంగా ఉండాల్సిన 8 శాతం వృద్ధి రేటును పరిగణనలోకి తీసుకున్నా, 2025-26 నాటికి ఈ పన్నుల ఆదాయం రూ. 1,00,219.69 కోట్లకు చేరాల్సి ఉందన్నారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో వాస్తవంగా వచ్చింది కేవలం రూ. 86,552.68 కోట్లు మాత్రమేనని చెప్పారు. ఈ లెక్కల ప్రకారం అంచనాల కంటే దాదాపు రూ. 13,667 కోట్ల మేర రాష్ట్ర ఆదాయం తగ్గిపోవడాన్ని చంద్రబాబు ప్రభుత్వం 'సంపద సృష్టి' అని ఎలా పిలుస్తుందని జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.10 పెరిగే అవకాశం!



**మొదటిపేజీ తరువాయి -** భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ పైన రూ.10 వరకు పెరిగే అవకాశముందని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే ఈ పెంపు ఒకేసారి లేదా దశలవారీగా ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై సగటున రూ.3 పెంచుతూ శుక్రవారం భారత చమురు రంగ కంపెనీలు నిర్ణయించాయి. సమీప భవిష్యత్తులో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తత కారణంగా రాబోయే రోజుల్లో అంతర్జాతీయంగా ఇంధన ధరలు భారీగా పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో చమురు కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాల నుంచి బయటపడేందుకు రూ.3 పెంచాయని, కానీ ఈ పెంపు చాలదని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండు మూడు వారాల్లో దశలవారీగా పెరుగుదల ఉండవచ్చని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో ధరల పెరుగుదలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం వసూలును దాదాపు నిలిపివేసింది. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు కూడా లాభాలను వదులుకుని అధిక వ్యయాన్ని భరించాయి. ఇలాంటి పరిస్థితుల్లో కంపెనీలు ఇంధన ధరలు పెంచుతున్నాయి. నిన్న పెరిగిన స్వల్ప పెరుగుదల కూడా కంపెనీల రోజువారీ నష్టాలను కొంతమేర తగ్గించిందే తప్ప తొలగించలేదు.

## రాయల్ ఎన్ ఫీల్డ్ బండెక్కిన చంద్రబాబు

**మొదటిపేజీ తరువాయి -** వివరాల్లోకి వెళితే, ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన 'హెల్మెట్ బ్యాంక్'ను సందర్శించారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పోలీసులను అభినందించారు. అనంతరం స్వయంగా హెల్మెట్ పెట్టుకుని బైక్‌పై కూర్చుని యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఇతర అధికారులు ఉన్నారు. అంతకుముందు, ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలోని 'స్వర ఆర్ట్ గ్యాలరీ' స్టాల్‌లో గిరిజనులు రూపొందించిన ఓవర్‌కోట్‌ను కొనుగోలు చేసి అక్కడే ధరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యమంత్రి ఇలా బైక్‌పై కనిపించడం స్థానికంగా ఆసక్తిని రేకెత్తించగా, ఈ వీడియోపై నెటిజన్లు సరదాగా స్పందిస్తున్నారు.

## విదేశాల్లో ఉన్నా సొంత దేశంలో ఉత్సవానికి హాజరైనట్టుగా ఉంది

**మొదటిపేజీ తరువాయి -** భారతీయులు తమ కుటుంబ విలువలను, సాంప్రదాయాలను ఎప్పటికీ వదులుకోలేదని కొనియా డారు. ప్రపంచంలో ఎన్నో సంస్కృతులు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ, భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ ప్రవాసుల హృదయాల్లో బలంగా సజీవంగా ఉందనడానికి ఈ సభే నిదర్శనమన్నారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడి దేశంలో దశాబ్దాల తర్వాత ఒక సంపూర్ణ మెజారిటీ కలిగిన స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయులు తనపై ఉంచిన నమ్మకమే దేశాభివృద్ధి కోసం తనను ఆగనివ్వకుండా, అలసిపోనివ్వకుండా ముందుకు నడిపిస్తోందని మోదీ ఎమోషనల్ అయ్యారు.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

**మొదటిపేజీ తరువాయి -** తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. నిన్న ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను మీడియాలోని ఒక వర్గం వక్రీకరించిన తీరును చదివి తాను ఆవేదన చెందానని పేర్కొన్నారు. మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారమని అన్నారు. మన దేశ యువతను చూసి ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. తన పట్ల వారికి గౌరవ మర్యాదలు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని అన్నారు. యువతను దేశాభివృద్ధికి మూలస్తంభాలుగానే చూస్తానని సూర్యకాంత్ తెలిపారు.

## బండి భగీరథ్ కేసులో మేడ్చల్ కోర్టుకు హాజరైన బాధితురాలు

**మొదటిపేజీ తరువాయి -** ప్రవర్తించాడని తల్లి ఇప్పటికే ఆరోపణలు చేశారు. అతని కారణంగా తన కూతురు చాలా రోజులుగా మానసిక వేదనకు గురైందని అన్నారు. ఈ వ్యవహారంలో ప్రస్తుతం సిట్ దర్యాప్తు కొనసాగుతోందని, నిజానిజాలు తప్పకుండా బయటకు వస్తాయని ఆమె అన్నారు. తమ వద్ద వాట్సాప్ చాటింగ్‌లు, మెసేజ్‌లు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఆధారాలు కూడా ఉన్నాయని తెలిపారు.

## 25 ఏళ్ల తర్వాత తెలంగాణలో 'ఎస్ఐఆర్'



**మొదటిపేజీ తరువాయి -** ఉంచుకోవచ్చని వివరించారు. ఆన్‌లైన్‌లో ఓటర్ల నమోదు కోసం జశీ-వతీం.వఎఱ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ ఎన్యుమరేషన్ ఫామ్‌ల ఆధారంగా జులై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. దీన్ని రాజకీయ పార్టీలకు అందిస్తామన్నారు. అలాగే వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ డ్రాఫ్ట్‌పై జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్లు తమ అభ్యంతరాలను తెలియజేయొచ్చని సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిశీలించిన తర్వాత అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని వెల్లడించారు. తెలంగాణలో దాదాపు 25 ఏళ్ల క్రితం ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియ జరిగిందని గుర్తుచేశారు.

# భోజ్‌శాల తీర్పు బాబ్రీ మసీదు తీర్పులాంటిదే



**మొదటిపేజీ తరువాయి -** మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల-కమల్ మౌలా మసీదు సముదాయాన్ని ఆలయంగా ప్రకటిస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు బాబ్రీ మసీదు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పోలి ఉందని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈ తీర్పు పూర్తిగా తప్పులతో కూడుకున్నదని, అనేక ప్రాథమిక వాస్తవాలను న్యాయస్థానం విస్మరించిందని ఆయన ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒవైసీ మాట్లాడారు. బాబ్రీ మసీదు కేసులో మాదిరిగానే 'ఆస్థ' (నమ్మకం) ఆధారంగానే ఈ తీర్పు కూడా వెలువడిందని ఆయన విమర్శించారు. "బాబ్రీ మసీదు కేసులో ముస్లింల ఆధీనంలో స్థలం లేదని కోర్టు చెప్పింది. కానీ భోజ్‌శాల విషయంలో మాత్రం శుక్రవారం వరకు ముస్లింల ఆధీనంలోనే ఉంది. అక్కడ ముస్లింలు 700 ఏళ్లుగా నమాజ్ చేస్తున్నారు" అని ఆయన గుర్తుచేశారు. బాబ్రీ మసీదు తీర్పు వెలువడినప్పుడే తాను ఒక విషయం చెప్పానని, 'ఆస్థ' ఆధారంగా ఇచ్చే తీర్పులు ఇలాంటి మరిన్ని వివాదాలకు తలుపులు తెరుస్తాయని హెచ్చరించానని ఒవైసీ అన్నారు. రెండు కేసుల్లో ఇచ్చిన ఊరట కూడా ఒకే విధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ తీర్పు రాజ్యాంగ విలువలకు అనుగుణంగా లేదని, ఒక మతం హక్కులను హరిస్తూ మరో మతానికి అనుకూలంగా తీర్పులివ్వడం ఆందోళన కరమని వ్యాఖ్యానించారు. చారిత్రక ఆధారాలను విస్మరిం చారని ఆరోపిస్తూ "1935 నాటి ధార్ స్టేట్ గెజిట్, 1985 నాటి వక్ఫ్ రిజిస్ట్రేషన్, ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం-1991 వంటి కీలక అంశాలను కోర్టు పట్టించుకోలేదు. ఈ వాస్తవాలన్నింటినీ సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుని న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాను" అని ఒవైసీ తెలిపారు. 1951లోనే ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) ఇది మసీదు అని, ఇక్కడ కేవలం ముస్లింలు మాత్రమే నమాజ్ చేసుకోవాలని, ఇతర మతాల ప్రార్థనలకు అనుమతి లేదని ఉత్తర్వులు ఇచ్చిందని ఆయన వివరించారు. అసలు అది ఆలయం కాదని, రాజా భోజ్ సంస్కృత విద్యను ప్రోత్సహించిన ఒక 'గురుకులం' అని శాసనాలు చెబుతున్నాయని ఒవైసీ పేర్కొన్నారు. "ప్రజాస్వామ్య దేవాలయం అని మనం పార్లమెంట్‌ను పిలుస్తాం. అంతమాత్రాన అది పూజలు చేసే స్థలం కాదు. అలాగే అదీ ఒక గురుకులం మాత్రమే" అని ఆయన పోల్చారు. ఈ కేసులో పిటిషనర్లతో నరేంద్ర మోదీ ప్రభుత్వం, ఏఎస్ఐ కుమ్మక్కయ్యాయని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 12లను ఉల్లంఘించడమేనని ఒవైసీ తీవ్ర ఆరోపణలు చేశారు. 1995లో ధార్‌లోని కొందరు ముస్లిం పెద్దలు మసీదులో మంగళవారం, బసంత్ పంచమి రోజుల్లో పూజలకు అనుమతిస్తూ ఒప్పందం చేసుకోవడం చారిత్రక తప్పిదమని ఆయన అభిప్రాయపడ్డారు.

## మొత్తం మహిళా లోకాన్నే అవమానిస్తున్నారు




**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 నాటికి తెలంగాణ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ తీవ్ర విమర్శలు గుప్పించారు. జూన్ 2న జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకల వేదికగానే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, అలాగే అమరవీరుల కుటుంబాలకు సమరయోధుల పెన్షన్లు అందించే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం వేసిన ప్రత్యేక కమిటీలో ఒక్క మహిళకు కూడా చోటు కల్పించకపోవడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఉద్యమంలో క్రియాశీలంగా పోరాడిన సమస్త మహిళా లోకాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. కేవలం కమిటీలతో కాలయాపన చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటేనని, ఒకవేళ జూన్ 2 లోపు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టకపోతే ఉద్యమకారుల సంఘాలతో కలిసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారిని గౌరవించేందుకు సూచనలు చేసేలా రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పటికే జీఓ నంబర్ - 679 ద్వారా ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కె.కేశవరావు ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, రాములు నాయక్, శోభన్ రెడ్డి కమిటీ సభ్యులుగా ఉన్నారు.

# నీట్ పేపర్ లీక్ కేసు బయాలజీ లెక్చరర్ అరెస్ట్

ప్రత్యేక కోచింగ్ పేరుతో విద్యార్థులకు ప్రశ్నలు చెప్పినట్టు వెల్లడి

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్- యూజీ ప్రశ్నాపత్రం లీక్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ మరో కీలక నిందితురాలిని అరెస్టు చేసింది. మహారాష్ట్రలోని పుణెకు చెందిన సీనియర్ బయాలజీ లెక్చరర్ మనీశా గురునాథ్ మందరేను దిల్లీలో సుదీర్ఘంగా విచారించిన అనంతరం అదుపులోకి తీసుకుంది. ఆమె నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏర్పాటు చేసిన నీట్ ప్రశ్నాపత్ర రూపకల్పన కమిటీలో సభ్యురాలిగా పనిచేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కారణంగా బోటనీ, జువాలజీ ప్రశ్నాపత్రాలకు ఆమెకు పూర్తి స్థాయి యాక్సెస్ ఉన్నట్లు సీబీఐ గుర్తించింది. సీబీఐ దర్యాప్తు ప్రకారం, మనీశా మందరే నీట్ పరీక్షకు ముందే కొంతమంది అభ్యర్థులను సంప్రదించి ప్రత్యేక కోచింగ్ నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రక్రియలో ఇప్పటికే అరెస్టైన మరో నిందితురాలు మనీశా వాఘ్మారే సహకరించినట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏప్రిల్ నెలలో పుణెలోని తన నివాసంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రశ్నలు, సమాధానాలు చెప్పినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆ సమయంలో విద్యార్థులు ఆమె చెప్పిన ప్రశ్నలను నోట్‌బుక్‌లలో రాసుకున్నారని అధికారులు తెలిపారు. మే 3న జరిగిన నీట్-యూజీ పరీక్షలో అదే ప్రశ్నలు రావడంతో పేపర్ లీక్ వ్యవహారం బయటపడిందని పేర్కొన్నారు. ఈ కోచింగ్ తరగతులకు హాజరైన విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు సీబీఐ అనుమానిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన కెమిస్ట్రీ నిపుణుడు ప్రొఫెసర్ పీవీ కులకర్ణి విచారణలో బయటపడిన వివరాల ఆధారంగానే మనీశా మందరే అరెస్టు జరిగినట్లు సమాచారం. లాతూర్‌కు చెందిన కులకర్ణి కూడా గతంలో ఎన్నో సంవత్సరాలుగా నీట్ ప్రశ్నాపత్రాల రూపకల్పనకు సంబంధించిన కమిటీల్లో పనిచేసినట్లు సీబీఐ వెల్లడించింది. ఆయన తనకు ఉన్న గోప్య సమాచారం దుర్వినియోగం చేసి విద్యార్థులకు ముందుగానే ప్రశ్నలు చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీబీఐ ప్రకారం, కులకర్ణి కూడా ఏప్రిల్ చివరి వారంలో తన ఇంట్లో ప్రత్యేక కోచింగ్ తరగతులు నిర్వహించి ప్రశ్నలు, ఆప్షన్లు, సమాధానాలను విద్యార్థులకు చెప్పినట్లు గుర్తించారు. ఈ తరగతులకు హాజరయ్యేందుకు విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు రాసుకున్న ప్రశ్నలు మే 3న నిర్వహించిన అసలు పరీక్షలో యథాతథంగా రావడంతో వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. నీట్- యూజీ పరీక్ష మే 3న దేశవ్యాప్తంగా జరిగింది. దేశంలోని 551 నగరాలతో పాటు విదేశాల్లోని 14 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. దాదాపు 23 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు నమోదు చేసుకున్నారు. అయితే పరీక్ష అనంతరం పేపర్ లీక్‌పై ఆరోపణలు రావడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఎన్‌టీఏ వెల్లడించిన వివరాల ప్రకారం, మే 7 సాయంత్రం తమకు అక్రమాలపై సమాచారం అందింది. వెంటనే మరుసటి రోజు ఆ వివరాలను కేంద్ర దర్యాప్తు సంస్థలకు పంపినట్లు తెలిపింది. అనంతరం సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తులో భాగంగా పుణె, లాతూర్, దిల్లీ సహా పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన సీబీఐ, పేపర్ లీక్‌కు సంబంధించి ఇప్పటివరకు తొమ్మిది మందిని అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో ఇంకా మరికొందరి పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో దర్యాప్తును మరింత విస్తరించినట్లు అధికారులు చెబుతున్నారు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక వైద్య ప్రవేశ పరీక్షగా భావించే నీట్‌లో ఇలాంటి అక్రమాలు బయటపడటం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పరీక్షల పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముందని సీబీఐ వర్గాలు సూచిస్తున్నాయి.



# బతికపల్లి సమస్యలు తీరుస్తా

## ప్రత్యేక నిధుల ద్వారా రోడ్లు, డ్రైనేజీలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తా

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**గొల్లపల్ల మే16(ప్రజా మంటలు అంకం భూమయ్య :** ధర్మపురి నియోజకవర్గ ప్రజలు తనపై విశ్వాసం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు బాధ్యతగా పనిచేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం పెగడపల్లి మండలం బతికే పల్లి గ్రామంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పెంట లక్ష్మీబాయి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా



మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలోని 149 గ్రామాల్లో బతికేపల్లి గ్రామానికి ఒక ప్రత్యేకత ఉందని మంత్రి తెలిపారు. సుమారు 7వేల ఓటర్లు ఉన్న బతికే పల్లి గ్రామం గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదని మంత్రి తెలిపారు. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన నియోజకవర్గ ఓటర్ల సమస్యలే పరిష్కారం ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని మంత్రి తెలిపారు. బతికే పల్లి గ్రామంలో రోడ్లు, మురుగు కాలువలు



నిర్మాణంతో పాటు మహిళా సంఘాల భవన నిర్మాణం, కుల సంఘాల భవన నిర్మాణాలతో పాటు పల్లె దవాఖాన మరియు ఇతర మౌలిక వసతులు కల్పనకు తన వంతుగా సహకరిస్తానని మంత్రి వివరించారు. స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా నిధులు కేటాయించి బతికేపల్లి అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి ఈ సందర్భంగా గ్రామస్తులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమం లో సర్పంచులు ప్రజా ప్రతి నిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న డీఎస్పీలకు ఘన సన్మానం,

## సేవలను కొనియాడిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల మే 16 (ప్రజా మంటలు) :**శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసింగ్ కార్యక్రమాల అమలులో విశేష సేవలందించిన డీఎస్పీలు రఘు చందర్, శ్రీనివాస్ లు బదిలీపై వెళ్లనున్న సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బదిలీపై వెళ్లనున్న అధికారులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో విధులు నిర్వహించిన కాలంలో అధికారులు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. ముఖ్యంగా పండుగలు, ఎన్నికలు, ప్రత్యేక బందోబస్తు విధులు,నేర నియంత్రణ, యువతలో మత్తు పదార్థాల నిర్మూలన వంటి అంశాల్లో అధికారులు సమర్థవంతంగా పనిచేశారని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ప్రతి




అధికారి తన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ ప్రజల భద్రతకే ప్రాధాన్యత ఇవ్వాలని, అదే పోలీసింగ్‌కు అసలైన గుర్తింపని ఎస్పీ గారు తెలిపారు. విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం ఉంటే ప్రజల ఆదరణతో పాటు ఉన్నతాధికారుల ప్రశంసలు కూడా లభిస్తాయని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సర్వసాధారణమని ఎక్కడ విధులు నిర్వహించిన అంకిత భావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కొత్తగా బదిలీ అయిన ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన సేవా తత్వంతో పనిచేసి ప్రజలకు మరింత చేరువ కావాలని, తమ అనుభవంతో పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లనున్న డీఎస్పీలు కూడా జగిత్యాల జిల్లాలో పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో పనిచేయడం గర్వంగా భావిస్తున్నామని తెలిపారు. జిల్లాలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సహకారం ఎల్లప్పుడూ లభించిందని పేర్కొన్నారు. జిల్లాలో పని చేసే అవకాశం రావడం సంతోషాన్ని ఇచ్చిందని, సమర్థవంతంగా పనిచేసిన మధుర స్మృతులతో బదిలీ పై వెళ్లడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రఘు చందర్, శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంతో పారదర్శకత, జవాబుదారీతనం

## రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి

**జగిత్యాల మే 16 (ప్రజా మంటలు) :** కలెక్టరేట్ లో ఆర్.టీ.ఐ చట్టంపై పీఐఓలు, ఏపీఐఓలకు అవగాహన సదస్సు ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తూ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమాచార హక్కు చట్టం - 2005 పై పీఐఓలకు, ఏపీఐఓలకు మరియు అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, సమాచార కమిషనర్లు పీ.వీ.శ్రీనివాస్ రావు, దేశాల భూపాల్ లు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. థర్డ్ పార్టీ ఇన్ఫర్మేషన్, వ్యక్తిగతంగా అడిగే సమాచారం, ఇవ్వవలసిన సమాచారం, ఇవ్వకూడని సమాచారం, తదితర వాటి గురించి సవివరంగా తెలియజేశారు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత పీఐఓలు, ఏపీఐఓలకు ఉందని అన్నారు.సమాచార చట్టం ప్రకారం సమాచారాన్ని కోరే హక్కు ప్రతి పౌరునికి ఉండడంతో పాటు, రికార్డులను, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించే అధికారం కూడా ఉందని తెలిపారు. పౌరులు కోరినప్పుడే సమాచారం ఇవ్వడం కాకుండా, సమాచార హక్కు చట్టం, సెక్షన్ 4(1)బి ప్రకారం స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చేలా అధికార యంత్రాంగాలు సమాయత్తం కావాలని సూచించారు. పబ్లిక్ అథారిటీ బాధ్యతలు, విధులు, నిర్వర్తించే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు 4(1) బి రిజిస్టర్లను అప్డేట్ చేసుకోవాలని, వీటన్నిటిని ప్రజలకు తెలిసేవిధంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం లక్ష మందికి సమాచారం అందించడం జరిగిందని తెలిపారు. మరో 15000 వరకు అప్పీల్స్ రాష్ట్ర సమాచార కమిషన్ కు వస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 20 జిల్లాలలో రాష్ట్ర సమాచార కమిషన్ పర్యటించిందని, సుదీర్ఘ కాలం నుండి పెండింగ్ లో ఉన్న పాత కేసులు అన్నింటిని పరిష్కరించడం జరిగిందని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరుకున్న సమాచారాన్ని పొందే అవకాశం ఉన్నందున పిఐఓలు, అధికార యంత్రంగాలు ప్రజల పక్షాన ఆలోచించి అడిగిన సమాచారాన్ని ఇవ్వాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కేవలం




కార్యాలయ విధుల్లో మాత్రమే కాకుండా ప్రతి ఉద్యోగి వ్యక్తిగత జీవితంలో కూడా పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి, నైతిక విలువలను పెంపొందించే ముఖ్యమైన చట్టమని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి కూడా కార్యాలయంలోని విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని సమాచార హక్కు చట్టం ఫిర్యాదులకు సకాలంలో స్పందించి వీలైనంత త్వరగా సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, వివిధ స్థాయిల జిల్లా శాఖల అధికారులు, జిల్లా, డివిజనల్, మండల స్థాయి అప్పీలేట్ అథారిటీలు, పీఐఓలు, ఏపీఐఓలు, మరియు ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గొల్లపల్లి కాంగ్రెస్‌కు కొత్త ఊపు,మండల అధ్యక్షుడిగా రాపెల్లి గంగన్న నియామకం

**గొల్లపల్లి, మే 16 (ప్రజా మంటలు):**కాంగ్రెస్ పార్టీకి ఎన్నో ఏళ్లుగా జెండా మోస్తూ, పార్టీకి వెన్నుముకగా నిలిచిన సీనియర్ నాయకుడు రాపెల్లి గంగన్నను గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమించడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆశీస్సులతో గంగన్నకు మండల అధ్యక్ష పదవి దక్కడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాపెల్లి గంగన్నను శనివారం ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు కలిసి సాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాపెల్లి గంగన్న మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి పనిచేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రజలకు చేరవేసేందుకు నిరంతరం శ్రమిస్తానని



తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్యతో పాటు మండల కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.సీనియర్ నాయకుడైన గంగన్నకు మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దాసరి తిరుపతి గౌడ్, చందోలి సర్పంచ్ జక్కుల పావని దస్తగిరి, దట్నూర్ సర్పంచ్ బెక్కం గంగారాం, భీంరాజపల్లె సర్పంచ్ లత గంగచారి, లక్ష్మీపూర్ సర్పంచ్ కాసం రాజశేఖర్, రంగాధమునిపల్లె సర్పంచ్ జెల్ల అఖిల అనిల్, గోవింద్‌పల్లె సర్పంచ్ మ్యాక్ స్వామి, నందిపల్లె సర్పంచ్ రాజేశ్వర్, బొంకూర్ సర్పంచ్ ముల్కల శిరీష శ్రీనివాస్, వెంగలపూర్ సర్పంచ్ రాంరెడ్డి, వెనుగుమట్ల సర్పంచ్ నక్క స్రవంతి జమలకర్, గొల్లపల్లి ఉప సర్పంచ్ గురిజల బుచ్చయ్య, వార్డు సభ్యులు చెవులమద్ది మల్లేష్, ముస్కు శ్రీపాల్ రెడ్డి, గంగాధర నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కట్ట లక్ష్మణ్, చాడ సత్తన్న, కాంగ్రెస్ నాయకులు చిర్ర దిలిప్, కిష్టంపేట రమేశ్ రెడ్డి, రామచందర్ రెడ్డి, గాజంగి సత్తన్న, నక్క విజయ్, దాసరి వెంకటేష్, తడగొండ విజయ్, చెవులమద్ది గంగాధర్, మద్దూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 18న దీక్ష చేపట్టి తీరుతాం

## బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి

**జగిత్యాల :మే 16(ప్రజా మంటలు) :**నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జగిత్యాల నియోజకవర్గానికి మంజూరు చేయించిన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం స్థలం మంజూరు చేయించడం చేతకాకపోతే జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న వారిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అరెస్టు అయిన తర్వాత పోలీస్ స్టేషన్ వద్ద బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని స్థలం కేటాయించాలని కోరుతూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ శాంతియుతంగా ఈనెల 18న జగిత్యాల తాసిల్ చౌరస్తా వద్ద ధర్మదీక్ష చేపట్టడానికి పూనుకుంటే పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం దారుణం అన్నారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తుండడం బాధాకరమన్నారు. ఇక్కడ ప్రశ్నించే గొంతును ముఖ్య ప్రయత్నం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుతంగా ఆందోళన చేయడానికి వస్తే అధికార పార్టీ నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకొని మాపై దౌర్జన్యం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మహిళా నేతలు సైతం అని చూడకుండా మానవత్వం మరిచిపోయి లాక్కుంటూ, దాడి చేస్తూ పోలీస్ స్టేషన్ తరలించడం సరికాదన్నారు. పోలీసుల తీరు చూస్తుంటే అసలు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేదా అన్నది



అనుమానంగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్థానిక అధికార పార్టీ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలని, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మంజూరు చేయించిన కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు వెంటనే 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. పరికరాల స్థలం కేటాయించడం చేతకాకపోతే వెంటనే తన పదవికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా స్థలం కేటాయించకపోతే ఈనెల 18న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో ధర్మదీక్ష చేపట్టి తీరుతామని స్పష్టం చేశారు. ప్రశ్నించే గొంతుకను ఎవరు ఆపలేరని, అన్ని వర్గాల ప్రజలు తమకు మద్దతు ఇస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనుప్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, మరియు భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా మండల అధ్యక్షులు మరియు పదాధికారులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయం కు స్థలం కేటాయించాలని మంత్రి శ్రీధర్ బాబుకు జగిత్యాల ఎమ్మెల్యే వినతి



**జగిత్యాల మే 16( ప్రజా మంటలు) :**ఐటి శాఖ మంత్రివర్యులు శ్రీదర్ బాబు ని వారి కార్యాలయం లో కలిసిఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, కేంద్రీయ విద్యాలయం కోసం చల్గల్ లో స్థలం కేటాయించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ జగిత్యాల ప్రాంతానికి సంబంధించిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, కేంద్రీయ విద్యాలయం స్థలం కేటాయింపు కొన్ని రోజులుగా వాయిదా పడడం తో నీటి పారుదల శాఖ మంత్రి ని గతం లో కలిసి వినతి పత్రాన్ని అందజేయటం జరిగింది. అదేవిదంగా స్థలం కేటాయించడానికి జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా పూర్తిగా సహకారం అందిస్తున్నారు అని ఎమ్మెల్యే తెలిపారు.ఐటి శాఖ మంత్రివర్యులు శ్రీదర్ బాబు ని వారి కార్యాలయం లో కలిసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం కోసం స్థలం కేటాయించాలని,చాలా రోజుల నుండి స్థలం కేటాయింపు వాయిదా పడడం జరుగుతుంది అని,స్థలం కేటాయించాలని వినతి పత్రాన్ని అందజేయగా స్పందించిన మంత్రి శ్రీదర్ బాబు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి తెలిపారు .మరియు సంబంధిత ఉన్నత అధికారులకు స్థలం త్వరితగతిన స్థలం కేటాయించాలని అధికారులను ఆదేశించడం జరిగింది అని అన్నారు.

# ఎల్కతుర్తిలో గొలుసుకట్టు కాలువల దుస్థితి.. తక్షణ పునరుద్ధరణ చేపట్టాలి, బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్





**ఎల్కతుర్తి, మే 15 (ప్రజా మంటలు):**ఎల్కతుర్తి మండలంలోని 20 గ్రామాల పరిధిలో ఉన్న గొలుసుకట్టు కాలువలు, పిల్ల కాలువలు పూర్తిగా పాడైపోవడంతో రైతులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి కాలువల పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమణలకు గురైన గొలుసుకట్టు కాలువలు, కెనాల్ కాలువలను గుర్తించి వెంటనే సవరించాలని కోరారు. భవిష్యత్తులో హైడ్రా తరహా చర్యలు తీసుకునే పరిస్థితి రాకముందే ముందస్తు ప్రణాళికతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు.కాలువల్లో పూడిక పేరుకుపోవడం వల్ల ప్రతి ఏటా వర్షాకాలంలో 20 గ్రామాల రైతులు, ప్రజలు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నీరు సాఫీగా వెళ్లేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి పూడికతీత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.పొలాలకు నీరందించే పిల్ల కాలువలు, బావుల వద్ద ఉన్న కెనాల్ కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో వర్షపు నీరు పంట పొలాల్లోకి చేరకుండా మురుగు కాలువలు, ప్రధాన కాలువల అనుసంధానాన్ని సక్రమంగా నిర్వహించాలని అధికారులను కోరారు."రైతుల ప్రయోజనాలను, ప్రజల ఆస్తులను పణంగా పెడితే బీజేపీ చూస్తూ ఊరుకోదు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలి. లేనిపక్షంలో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, ఆడెపు శ్రీవర్ధన్, కొడం రమేష్, మాటూరు విద్యాసాగర్, చీరాల రంజిత్, సూదిరెడ్డి సాయిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకొండలో ఘనంగా శని జయంతి, చండీ హోమం

**కొత్తకొండ, మే 14( ప్రజా మంటలు):-** భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో శని అమావాస్య, శని జయంతిని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అమావాస్య సందర్భంగా ప్రతి నెల ఆనవాయితీగా నిర్వహించే చండీ హోమాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారని కార్యనిర్వహణాధికారి పి. కిషన్ రావు తెలిపారు.



# మాజీ మంత్రి రాజేశం గౌడ్‌కు విజయవంతమైన మోకాలి మార్పిడి శస్త్రచికిత్స



**హైదరాబాద్, మే 16 (ప్రజా మంటలు):**హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని స్టార్ హాస్పిటల్ లో రాజేశం గౌడ్‌కు విజయవంతంగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించారు.రాజేశం గౌడ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పలువురు ప్రముఖులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ , మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, , జస్టిస్ నవమోహన రావు, రిటైర్డ్ జస్టిస్ కుమార్యన్, ఎల్జెపీ పార్టీ రాష్ట అధ్యక్షుడు కొమ్మినేని వికాస్ బాబు తదితరులు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.అత్యాధునిక వైద్య సదుపాయాలతో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైందని, వైద్య బృందం అందించిన సేవలను ప్రముఖులు అభినందించారు. రాజేశం గౌడ్ త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.

# నీతి, నిజాయితీకి మారుపేరు డాక్టర్ జస్టిస్ జి. చంద్రయ్యకు నివాళులు,మాజీ మంత్రి రాజేశం గౌడ్

**హైదరాబాద్, మే 16 (ప్రజా మంటలు):**విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి, మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ జి. చంద్రయ్య అకాల మరణం బాధాకరమని మాజీ సీనియర్ మంత్రి గొడిశెల రాజేశం గౌడ్, మాజీ న్యాయమూర్తి నవ మోహన్ రావు, పాత్రికేయులు ప్రభాకర్ రావు, ఎల్జేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మినేని వికాస్ బాబు విచారం వ్యక్తం చేశారు.మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ జస్టిస్ జి. చంద్రయ్యతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఆయన, న్యాయం, నిజాయితీ, సేవాభావంతో ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మహనీయుడిగా కొనియాడారు. ఆయన మరణం న్యాయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు.డాక్టర్ జస్టిస్ జి. చంద్రయ్య తన సేవల ద్వారా సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారని, ఆయన జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# కేంద్రీయ విద్యాలయం కు ఇంటిగ్రేట్ స్కూలుకు స్థలం కేటాయింపు జీవో జారీ



**జగిత్యాల మే 16(ప్రజా మంటలు) :** జిల్లా కు కేటాయించిన కేంద్రీయ విద్యాలయానికి,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ లకు స్థలం కేటాయింపు జి వో జారీ అయింది.....ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ జగిత్యాల జగిత్యాల జిల్లా చల్గల్ కు మంజూరైన కేంద్రీయ విద్యాలయనికి 2 ఎకరాల స్థలం,మరియు ముఖ్యమంత్రి జిల్లా కు మంజూరు చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ కోసం 10 ఎకరాల స్థలం కేటాయించడం జరిగింది.స్థలం కేటాయింపునకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి,జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి జిల్లా మరియు జగిత్యాల నియోజకవర్గ ప్రజల పక్షాన హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ చల్గల్ లో ఉన్న వాలంతరి అనేది అటానమస్ సంస్థ అని రైతుల కోసం ఏర్పాటు చేసింది అని, నేషనల్ హై వేకు దగ్గరగా ఉన్న చాలా విలువైన స్థలాన్ని కేటాయించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

# మాఫియాలో చేరాలని ప్లాన్,తల్లిని కిరాతకంగా చంపిన బాలుడు

**క్రమశిక్షణ పేరుతో ఆంక్షలు పెడుతోందని**

**కన్నతల్లిని హత్య చేసిన కొడుకు**

**స్నేహితుడితో కలిసి పథకం ప్రకారం**

**దారుణానికి ఒడిగట్టిన 16 ఏళ్ల బాలుడు**

**హత్య తర్వాత బంగారం, నగదుతో**

**ముంబై వెళ్లి మాఫియాలో చేరాలని ప్లాన్**

**సాంకేతిక ఆధారాలతో నిందితులను**

**తిరుపతిలో పట్టుకున్న పోలీసులు**



అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకే ఆ తల్లి పాలిట యముడయ్యాడు. క్రమశిక్షణతో మెలగమని చెప్పిన మాటలే అతనికి నచ్చలేదు. కన్నతల్లి పెట్టిన ఆంక్షలను భరించలేక స్నేహితుడితో కలిసి కిరాతకంగా హతమార్చాడు. సభ్యసమాజాన్ని నివ్వెరపరిచే ఈ దారుణ ఘటన విజయనగరం జిల్లా రాజాం పట్టణంలో చోటుచేసుకుంది.రాజాం మున్సిపాలిటీ పరిధిలోని డోలపేటకు చెందిన ముంజేటి స్పందన(34)కు 16 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఇటీవల పదో తరగతి పూర్తి చేశాడు. కొడుకు చెడుదోవ పడతాడనే భయంతో స్పందన అతడిపై తరచూ ఆంక్షలు విధిస్తూ కఠినంగా వ్యవహరించేవారు. ఇదే సమయంలో తాను ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నానని తల్లికి చెప్పగా, ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తల్లిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని ఆ బాలుడు నిర్ణయించుకున్నాడు.ఈ విషయాన్ని తన స్నేహితుడికి చెప్పి, ఇద్దరూ కలిసి హత్యకు పథకం రచించారు. మే 4న పథకం ప్రకారం తన స్నేహితుడిని ఇంటికి పిలిపించాడు. ఆ సమయంలో ఇంట్లో లేని తల్లికి ఫోన్ చేసి రప్పించాడు. తల్లి ఇంటికి రాగానే బాత్రూమ్‌కు వెళ్తుందని ఊహించి, అక్కడే స్నేహితుడిని మాటు వేయమని సూచించాడు. స్పందన బాత్రూమ్‌లోకి వెళ్లగానే ఆమె స్నేహితుడు గట్టిగా పట్టుకోగా, ఇద్దరూ కలిసి రెండు చాకులతో ఆమె శరీరంపై సుమారు 15 సార్లు విచక్షణారహితంగా పొడిచి దారుణంగా హత్య చేశారు.అనంతరం బాత్రూమ్‌లోని రక్తపు మరకలను శుభ్రం చేసి, మృతదేహాన్ని ఇంటి వెనుక ఉన్న చెరువు వద్ద ముళ్లపొదల్లో పడేశారు. ఇంట్లోని 9.5 తులాల బంగారం, రూ. 5 వేల నగదు, తల్లి మొబైల్ ఫోన్‌తో పరారయ్యారు. ముంబై వెళ్లి మాఫియాలో చేరాలనే లక్ష్యంతో ముందుగా పలాస చేరుకుని, అక్కడి నుంచి ముంబై వెళ్లారు.మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, స్పందన శరీరంపై కత్తిపోట్లు ఉండటంతో హత్యగా నిర్ధారించారు. కొడుకు అదృశ్యం కావడంతో అతనిపై అనుమానంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో స్నేహితులతో మాట్లాడటాన్ని సాంకేతిక ఆధారాలతో పోలీసులు గుర్తించారు. వారు ముంబైలో ఉన్నట్లు నిర్ధారించుకుని స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. అయితే, అక్కడి నుంచి తప్పించుకుని వారు తిరుపతి చేరుకున్నారు. వారి కదలికలను నిరంతరం గమనిస్తున్న రాజాం పోలీసులు, తిరుపతి పోలీసుల సహకారంతో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, శ్రీకాకుళంలోని జువైనల్ బోర్డు ఎదుట హాజరుపరిచినట్లు డీఎస్పీ రాఘవులు మీడియాకు వెల్లడించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

**నలుగురు మహిళా కూలీల మృతి**

**టిప్పర్ ఢీకొనడంతో నలుగురు మహిళా కూలీల మృతి**

**కొవ్వూరు వంతెన సమీపంలో ఘటన**

**ఒకే గ్రామానికి చెందిన నలుగురు మృతి చెందడంతో విషాదం**

**మరో ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు**




కాకినాడ జిల్లాలో శనివారం ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు వంతెన సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళా కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పనులకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న వారిని వేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. చీడగ గ్రామానికి చెందిన రోజువారీ కూలీలు ఉపాధి పనుల నిమిత్తం శనివారం ఉదయం బయలుదేరారు. కొవ్వూరు వంతెన వద్ద వారు రోడ్డు దాటుతుండగా, అతివేగంతో వచ్చిన టిప్పర్ లారీ వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సత్యవతి, కృష్ణవేణి, చిట్టెమ్మ, అన్నవరం అనే నలుగురు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరంతా చీడగ గ్రామానికి చెందినవారే కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# విద్యుత్ సంస్థల్లో ఉద్యోగాల జాతర

**629 ఏఈఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఓకే**

**ఏపీ విద్యుత్ సంస్థల్లో 629 ఏఈఈ పోస్టుల భర్తీకి ఆమోదం**

**ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో ఖాళీల భర్తీకి ప్రభుత్వ నిర్ణయం**

**వార్షిక జాబ్ క్యాలెండర్‌లో భాగంగా ఈ నియామకాలు**

**రాతపరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక**

**ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల హర్షం**




ఏపీలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ ఇంజినీర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలైన ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, మూడు విద్యుత్ పంపిణీ సంస్థల్లో (డిస్కంలు) కలిపి మొత్తం 629 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ జారీకి ఇంధన శాఖ నుంచి అధికారికంగా అనుమతులు లభించాయి. దీంతో త్వరలోనే నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది.రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతుండగా, క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో సాంకేతిక సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని, ప్రజలకు సత్వర సేవలు అందడం లేదని చాలా కాలంగా ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో, ఖాళీగా ఉన్న ఏఈఈ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. క్షేత్రస్థాయి అవసరాలు, ఉద్యోగ సంఘాల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం ఈ పోస్టుల భర్తీకి ఆమోదముద్ర వేసింది.కూటమి ప్రభుత్వం ప్రకటించిన వార్షిక జాబ్ క్యాలెండర్‌లో భాగంగానే ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా రాతపరీక్ష ద్వారా నిర్వహిస్తారు. ఎంపికైన వారిని నేరుగా రెగ్యులర్ ప్రభుత్వ పోస్టుల్లో నియమిస్తారు. ప్రధానంగా ఎలక్ట్రికల్, సివిల్, టెలికాం విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టనున్నారు. కొన్ని పరిపాలనాపరమైన కారణాల వల్ల కొంత ఆలస్యమైనప్పటికీ, అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో ప్రక్రియ వేగవంతం కానుంది.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. భారీ సంఖ్యలో ఏఈఈ పోస్టుల భర్తీకి అనుమతించినందుకు సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లకు ఏపీ బహుజన విద్యుత్ ఉద్యోగుల యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ నిర్ణయంతో నిరుద్యోగులకు ఉపాధి లభించడంతో పాటు విద్యుత్ సంస్థల్లో పనిభారం తగ్గి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.ఎం. రవిశంకర్ ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హతలు, సిలబస్, పరీక్ష తేదీలతో కూడిన పూర్తిస్థాయి నోటిఫికేషన్ త్వరలోనే అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులోకి రానుంది.

# విజయవాడలో వైద్యుడి మోసం

**పెళ్లి దాచి నర్సుతో నాలుగేళ్లు కాపురం, కేసు నమోదు**

**పెళ్లి విషయం దాచి నర్సుతో నాలుగేళ్లుగా కాపురం చేసిన వైద్యుడు**

**విజయవాడలో డాక్టర్ భాస్కర్‌పై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

**రెండుసార్లు అబార్షన్ చేయించాడని బాధితురాలి ఆరోపణ**

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు**



తాను పనిచేసే ఆసుపత్రిలోని నర్సును ఓ వైద్యుడు మోసం చేసిన ఘటన విజయవాడలో వెలుగు చూసింది. తనకు అప్పటికే వివాహమైన నిజాన్ని దాచిపెట్టి, ఓ నర్సుతో నాలుగేళ్లుగా సహజీవనం చేసి, చివరకు మోసం చేశాడనే ఆరోపణలపై డాక్టర్ భాస్కర్‌పై కేసు నమోదైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు విజయవాడ మహిళా పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.వివరాల్లోకి వెళితే.. డాక్టర్ భాస్కర్ తన వద్ద పనిచేసే నర్సుతో పరిచయం పెంచుకుని, ప్రేమ పేరుతో ఆమెను లోబరుచుకున్నాడు. దండలు మార్చుకుంటే పెళ్లి జరిగినట్టేనని నమ్మించి, ఆమెతో నాలుగేళ్లుగా కాపురం చేశాడు. ఈ క్రమంలో, పిల్లలు వద్దనే కారణంతో రెండుసార్లు బలవంతంగా అబార్షన్ చేయించాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.ఇటీవల డాక్టర్ భాస్కర్ మొదటి భార్యకు ఈ విషయం తెలియడంతో ఆమె భర్తను నిలదీసింది. దీంతో భయపడిన భాస్కర్, నర్సుతో తనకున్న సంబంధాన్ని తెంచుకుని, ఆమెను దూరం పెట్టాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు, తనకు న్యాయం చేయాలని కోరుతూ మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

**ఈసారి ముందుగానే నైరుతి రుతుపవనాలు**

**మే 26 నాటికి కేరళను తాకే అవకాశం**

**ఉందన్న ఐఎండీ**

**ఇప్పటికే అండమాన్ నికోబార్ దీవులను**

**తాకిన రుతుపవనాలు**

**ఏపీలో మిశ్రమ వాతావరణం**

**కొన్నిచోట్ల వడగాల్పులు, మరికొన్నిచోట్ల వర్షాలు**



అధిక ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చల్లటి కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే దేశంలోకి ప్రవేశించనున్నాయని శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. సాధారణంగా జూన్ 1న కేరళ తీరాన్ని తాకే రుతుపవనాలు, ఈసారి మే 26 నాటికే ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది. దీనికి నాలుగు రోజులు అటుఇటుగా ఉండే అవకాశం ఉందని కూడా స్పష్టం చేసింది.వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో రుతుపవనాలు శనివారం నాటికి అండమాన్ నికోబార్ దీవులను తాకాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారి ఆంధ్ర, తమిళనాడు తీరాల నుంచి దూరంగా కదులుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రుతుపవనాల రాకకు మార్గం సుగమమైందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రుతుపవనాలు ఉత్తరం వైపు పయనించే కొద్దీ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడతాయని, ప్రజలకు వేడి నుంచి ఉపశమనం లభిస్తుందని ఐఎండీ తెలిపింది. గత 21 ఏళ్లుగా ఐఎండీ రుతుపవనాల రాకపై కచ్చితమైన అంచనాలను వెలువరిస్తోంది.ఏపీలో వింత వాతావరణంప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో వింత వాతావరణం నెలకొంది. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు పలుచోట్ల అకాల వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ముఖ్యంగా అల్లూరి, పోలవరం, కోనసీమ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, అనంతపురం జిల్లాల్లోని సుమారు 20 మండలాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల వరకు చేరవచ్చని తెలిపింది.అదే సమయంలో అల్లూరి సీతారామరాజు, శ్రీ సత్యసాయి, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రైతులు, పశువుల కాపరులు చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని అధికారులు సూచించారు. మొత్తం మీద రుతుపవనాల రాక కబురు ఆశలు రేపుతున్నప్పటికీ, ప్రస్తుతానికి ప్రజలు అధిక వేడి, పిడుగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

# అత్యాచారం కేసులో సీఐ చిన్న మల్లయ్యకు హైకోర్టులో చుక్కెదురు

**ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన న్యాయస్థానం**

**కేసు విచారణ ప్రాథమిక దశలో ఉందని,**

**నిందితుడు పరారీలో ఉన్నాడని పేర్కొన్న కోర్టు**

**పల్నాడు జిల్లాలో మహిళ ఫిర్యాదుతో ఏప్రిల్ 29న కేసు నమోదు**



అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌కు గురైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) బి. చిన్న మల్లయ్యకు హైకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ఆయన దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. జస్టిస్ మేడమల్లి బాలాజీ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.విచారణ సందర్భంగా, కేసు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, నిందితుడైన చిన్న మల్లయ్య పరారీలో ఉన్నారని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉందని, ఫోరెన్సిక్ నివేదికలు రావాల్సి ఉందని వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి, బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చారు.పల్నాడు జిల్లా వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మహిళ, తనపై సీఐ చిన్న మల్లయ్య లైంగిక దాడికి పాల్పడ్డారని ఏప్రిల్ 29న వినుకొండ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అప్పటినుంచి చిన్న మల్లయ్య పరారీలో ఉండగా, పోలీసు శాఖ ఆయన్ను సస్పెండ్ చేసింది.

# నాంపల్లి రైల్వే స్టేషన్ లో అగ్నిప్రమాదం,ఏసీ బోగీలో మంటలు

**నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న రైలులో అగ్నిప్రమాదం**

**హైదరాబాద్-జైపూర్ స్పెషల్ ట్రైన్‌లోని రెండు ఏసీ బోగీలు దగ్ధం**

**ప్రయాణికులు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం**

**ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించిన దక్షిణ మధ్య రైల్వే**



హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్‌లో నిన్న సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. ప్లాట్‌ఫామ్‌పై ఆగి ఉన్న హైదరాబాద్-జైపూర్ స్పెషల్ ట్రైన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కలకలం రేగింది. ప్రయాణికులు ఎక్కకముందే ఈ ఘటన జరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.వివరాల్లోకి వెళ్తే, రాత్రి 7:50 గంటలకు జైపూర్ బయలుదేరాల్సిన స్పెషల్ రైలును ప్లాట్‌ఫామ్ 4 పైకి తీసుకొస్తున్న సమయంలో, సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో బీ1, బీ2 ఏసీ కోచ్‌ల నుంచి దట్టమైన పొగ, మంటలు వచ్చాయి. ఆ సమయంలో బోగీలు ఖాళీగా ఉండటంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. రైల్వే సిబ్బంది వెంటనే స్పందించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. మూడు ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ముందుజాగ్రత్త చర్యగా మంటలు వ్యాపించిన రెండు కోచ్‌లను రైలు నుంచి వేరు చేశారు.ఈ ప్రమాదం కారణంగా హైదరాబా ద్-జైపూర్ రైలును నాలుగు న్నర గంటలు ఆలస్యంగా రీషెడ్యూల్ చేసి పంపిం చారు. ఘటన వల్ల ఇతర రైళ్ల రాకపోకలకు పెద్దగా అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు. ఘటనపై అధికారులు ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు.

# ఐదో అంతస్తు నుంచి కిందపడ్డ లిఫ్ట్

**ఆరుగురు బీఆర్ఎస్ నేతలకు గాయాలు**

**హైదరాబాద్‌లో తెగిపడిన అపార్ట్‌మెంట్ లిఫ్ట్**

**ఆరుగురు బీఆర్ఎస్ నాయకులకు గాయాలు, ఆసుపత్రికి తరలింపు**

**పార్టీ సమావేశం ముగించుకుని వస్తుండగా ఘటన**



హైదరాబాద్‌లో పెను ప్రమాదం చోటుచేసుకుంది. లిఫ్ట్ తెగిపడటంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగురు నాయకులు గాయపడ్డారు. ఈ ఘటన నిన్న సాయంత్రం మణికొండ సమీపంలోని డాలర్ హిల్స్‌లో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగింది. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.వివరాల్లోకి వెళ్తే, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ కార్తీక్ రెడ్డి తలపెట్టిన పాదయాత్రపై చర్చించేందుకు నాయకులు ఈ అపార్ట్‌మెంట్‌లోని ఐదో అంతస్తుకు వచ్చారు. సమావేశం ముగిశాక తిరిగి కిందికి వస్తుండగా, సాంకేతిక లోపంతో లిఫ్ట్ వైర్లు తెగిపోయి ఒక్కసారిగా కిందపడిపోయింది. ఈ ఘటనతో అపార్ట్‌మెంట్‌లో ఒక్కసారిగా కలకలం రేగింది.ఈ ప్రమాదంలో లిఫ్ట్‌లో ఉన్న ఆరుగురు నాయకులకు గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి కాళ్లకు తీవ్ర గాయాలైనట్టు సమాచారం. వారిని మెరుగైన చికిత్స కోసం వెంటనే జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. మిగిలిన నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే అపార్ట్‌మెంట్ వాసులు, ఇతర పార్టీ కార్యకర్తలు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని లిఫ్ట్ నుంచి బయటకు తీసి ఆసుపత్రికి పంపించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బండి సంజయ్‌కు భారీ ఊరట

**ఆయనపై ఉన్న పోస్టులన్నీ తొలగించాలని కోర్టు ఆదేశం**

**కేంద్రమంత్రి బండి సంజయ్‌కు అనుకూలంగా సిటీ సివిల్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు**

**కుమారుడి పోక్సో కేసుతో ఆయన పేరును ముడిపెట్టొద్దని ఆదేశం**

**సంబంధిత వీడియోలు, వార్తలను వెంటనే తొలగించాలని స్పష్టీకరణ**

**గూగుల్, మెటా, ఎక్స్‌తో పాటు పలు మీడియా సంస్థలకు కోర్టు ఆదేశాలు**

**ఉత్తర్వులు పాటించకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు తప్పవని హెచ్చరిక**



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన కుమారుడిపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి, బండి సంజయ్ పేరును ముడిపెడుతూ మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు, పోస్టులను తక్షణమే తొలగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు విషయంలో ఆయన పేరును ఎక్కడా ప్రస్తావించరాదని స్పష్టం చేసింది.తన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ బండి సంజయ్ నాంపల్లిలోని సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. గూగుల్, మెటా, ఎక్స్ కార్ప్‌తో పాటు పలు టీవీ ఛానెళ్లను ప్రతివాదులుగా చేర్చి ఆయన దావా వేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన న్యాయస్థానం, బండి సంజయ్‌కు వ్యతిరేకంగా ఉన్న అన్ని రకాల కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశించింది.భవిష్యత్తులో కూడా ఈ కేసుకు సంబంధించి బండి సంజయ్ పేరుతో ఎలాంటి వార్తలు ప్రసారం చేయరాదని, ప్రచురించరాదని కోర్టు గట్టిగా ఆదేశించింది. ఈ ఉత్తర్వులను పాటించని పక్షంలో కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించింది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com